దేశభక్తి — పతిసేవ

శ్రీమతి కోణరంచి వెంకటసుబ్బమ్మాదేవిగారు

అంధకార మైలైదలను వ్యాపించియుండెను. ఆకాశముపై నక్షత్రములు మినుకు మినుకు మనుచుండెను. మాపరకు భీతిగొల్పు నిశాకన్య నీలవసనాచ్ఛాదితయై తన సహజసౌందర్యముతో చరించుచుండెను. సకల ప్రాణులును పగలంతయు సూర్యుని వేడికిరణములకు దప్పియు, మేతకొఱకై పలువిధములగు పాట్లుపడి యుండుటచేతను తమ గుడారములలో చల్లని మంద మారుతము వీచుచుండ హాయిగ నిద్రించుచుండెను. వనమునం దచ్చటచ్చట కీచురాలు మాత్రము తమ కంఠములనెత్తి బిగ్గరగా వనమంతయు ప్రతిధ్వనించునట్లు గానమొనర్చుచుండెను. అప్పుడప్పుడు పక్షులు తమ రెక్కలు రెపరెప కొట్టుకొను ధ్వనితప్ప ప్రకృతియంతయు నిశ్శబ్దముగ నిద్రించుచుండెను. ఆ మహారణ్యమున పెద్ద పెద్ద దేవదారు, పనస మున్నగు వృక్షరాజములును, కంటకయుతమగు తుప్పలును, మల్లె, మొల్ల, మొదలగు పుష్పలతలును, పొదలును నిండియుండెను. వానిమధ్య నొక పొదరింటిలో నిద్దరు వ్యక్తులుమాత్రము, దీపపువెలుతురునందు కూర్చుండి జాగ్రదవస్థలోనుండిరి. వా రిరువురికిని నిద్రయను మాటయే లేదు. దృఢమగు మనస్సుతో ఆ నిర్జనారణ్యమున వారేలయుండిరో? వా రిరువురును అన్యోన్యానురాగముగల దంపతులైయుండిరి. అత్యంతభయాకులితయై సాశ్రునయనములతో బెదరి బెదరి చూచుచు మహావిపత్తును సూచించుచు భర్తతో భార్య ఇట్లనెను.:—

ప్రాణనాథా! నేను ఈ నిర్జనారణ్యములో నీ విరహవేదనను భరింపజాలను. మీరు వెళ్లెదనని చెప్పుటతోడనే నా ప్రాణము లెగిరిపోవుచున్నవి. అబలనగు నన్ను విడచిపోవుట పాడియేనా? ఎట్టి కష్టమునకైనను వెనుకాడను. మీయొక్క ఎడబాటును మాత్రము సహింపజాలను. నన్ను ను మీ వెంట గొనిపొండు.

ఆ దీనాలాపయగు ప్రాణేశ్వరియొక్క ముఖవిలాసమును, ఆ చంద్రముఖియొక్క కౌముదీవికాసమునను, చలించిన హృదయముతో ముద్దిడుకొని అత డిట్లనెను. "ప్రాణేశ్వరీ! నిన్నెల్లప్పుడును నా హృదయమునందిడి ప్రేమించుచుందును. నీ కేమియు భయములేదు. అత్యవసరమైన కార్యము గనుక, నేను వెళ్లకతప్పదు. కదనరంగమున స్త్రీలతోనుండుట కష్టతరము. ఎవరివలన నా విభవవిలాస మంతరించెనో, మన మెవని దుర్నయమువలన గృహమువిడచి వనవాస మొనర్చుచున్నామో, ఎవనివలన మన దేశమందలి అనేక గృహములందలి జనులు అన్నములేక కృశించిపోవుచున్నారో, ఎవని కఠినశాసనములచే స్వర్గమయమగు మాతృభూమి అపవిత్రమయ్యెనో, ఎవని దుర్నయ మెల్లెడల వ్యాపింప నరనరమునందును కోపాగ్ని ప్రజ్వరిల్లుచుండ ప్రతి మనుజుడును వాని నాశనమునే కోరుచున్నాడో, ఆకాశమున నెగిరిపోవు పక్షులు సైతము ఎవని మరణమును కోరుచు అరచుచున్నవో, నోరులేని కృపాణముకూడా ఎవని పాపఫల మెప్పుడు రుచిచూపింతునాయని యొరలోనుండి నిక్కినిక్కి చూచుచున్నదో, అట్టివాని వినాశము త్వరలో జేరానున్నది. స్వదేశాభిమానులగు మహనీయులే ఈ ద్వేషమును తెలిసికొని దుష్టులను పాఱదార్చి జయము నొందుట నిశ్చయము. భూమిపై మానవజన్మమెత్తినందులకు దేశసేవజేయుటయే ముఖ్యము. అసంఖ్యాకులు విరామములేక ప్రలాపించు దీనాలాపములు భగవంతు డెప్పుడు మాన్పునో తెలియదుగదా! నా శరీరములో నేమాత్రమubalము మిగిలియున్నను తుదివరకు శత్రువులను వెదకి వెదకి నా కృపాణమున కెరజేసి నా ప్రియమగు రాజ్యమును రక్షించుకొందును. శత్రువినాశమునకై రణభేరి మ్రోగుచున్నది. నీవును మన దేశముయొక్క విజయప్రకాశమును

త్వరలోనే చూచెదవు గాక! విజయా! నీ సహజ సౌందర్యమును జిమ్ము కటాక్షములతో నాకు సెలవిమ్ము! నేను తిరిగి నీ ప్రేమడోలికల నూగులాడుటకు వెంటనే శత్రువిచ్ఛేదనము చేసి జయమును పొంది వచ్చెదను. ప్రియా! సెలవు. పద్మలతవలె తన హస్తద్వయమును ప్రియుని కంఠముపై వైచి చకోరము వలె విహ్వలనయనములతో విభుని జూచుచు ఆమె ఇట్లనెను. మనోనాయకా! ప్రేమించు జనులను ఆదరముగను, ద్వేషించువారిని విషతుల్యముగను, జూచుచు శత్రువులను నీ కృపాణమున కెరచేయుటుచితమగునా? సర్వజనులను ఒకేవిధముగా పరిగణించి ఘోరమగు ద్వేషమును హతమార్పరాదా? లేదేని విషప్రయోగమువలన శత్రువుల నాశన మొనరింపరాదా?

యువకు డిదివిని నవ్వుచు ఇట్లనెను. ప్రియా! నీ మాటలు చాలా బాగున్నవి. కుటిలోపాయములచే శత్రుసంహారణమునకు గడంగుట మిగుల హేయము. అట్టి యనుచితకార్యము ఉత్తమపురుషులకు కీర్తిప్రదము కాజాలదు. ఖడ్గహస్తుడై రణరంగమున శత్రువుల నెదుర్కొనువాడే వీరుడు. వానిని సఖులు, సహోదరులు మున్నగువారు పిరికివాడనక సన్మానింతురు. ఇది విని లజ్జావనతవదనయై విజయ ఇట్లనెను. నాథా! సరే, అటుల చేయజాలనియెడల ఈదాసిని కూడా మీవెంట దీసికొనిపొండు. మీ రెక్కడకేగినను నేను మీవెంట వచ్చి పాదసేవజేతును. మీ బాహువల్లికను విడువజాలను. ప్రియా! ఒకవేళ మీరు నన్ను తీసికొని వెళ్లనియెడల, వియోగభరమును తాళజాలక విషముత్రాగి మిమ్ము స్మరించుచు నా ప్రాణములను విడతును.

యువకు డిట్లనెను. ప్రియా! నీమాటలు వినజాలకున్నాను. వెడలుము; ఈ స్త్రీవేషమును విడచి పురుషరూపమును ధరింపుము. పురుషానుకూలమగు ధైర్యము నవలంబింపుము. లజ్జాభయములను వదలుము. అబలననియు, సుకుమారిననియు నిప్పట్టున మరచిపొమ్ము. పరహస్తగతయగు మాతృభూమిని నుద్ధరించుటకు వెడలుము. నేనుమాత్రము పురుషుడనై జన్మించి నిజకర్తవ్యమెట్లు మరతును?

పతిమాటలు వినినంతనే పుష్పభారరహితయగు లతవలె కడుసంతసించినదై యుప్పొంగుచు లేచి పురుషోచితవస్త్రములను ధరించి తలకు పాగను చుట్టివైచెను. యువకునివంటి శరీరముతో తన నెవరును స్త్రీయని గుర్తించలేరని చిరునగవుతో మందగమనమున పతికడకు వచ్చెను. భర్త మందహాసమున నిట్లనెను. ప్రియా! ఈ నూతనపురుషవేషమును కాంచి ముగ్ధుడనైతిని సుమా! కాని నీయొక్క నయనవిలాసమును మాత్రము దాచలేకపోతివి. ప్రియా! మెఱయుచున్న కన్నులెంత యందముగానున్నవి. నీ ఛద్మరూపము గుర్తించువారెవరు? భ్రూమధ్యమున వనదృశ్యమును ధ్యానింతుము. ఈ యత్యంత సుఖదాయకమగు కుటీరమును, ఈ తరులతా వాటికలును, ఈ పశు పక్షి జాతములును, ఈ వనమునందుండు వినోదములను మొదలగువానిని విడచుట బహు కష్టముగానున్నది. మరల నిచటికెపుడు తిరిగి రాగలమో ఎవరు చెప్పగలరు?

ఇది విని అశ్రువులు నయనముల గ్రమ్ముకొన విజయ ఇట్లనెను. ఇంతకంటె మించిన సుఖప్రదమగుతా వీ ప్రపంచమునం దెచ్చటను లేదను టతిశయాంశము కాదు. ఈ వనపక్షులకంటె మించినవా రెవరు గలరు? ప్రపంచమును పరికించిచూచిన నది స్థిరమైనదియు కాదు. నేటివరకు నే నీవనమును, ఈ లతలను స్థిరమనియే తలంచుచుంటిని. క్షణభంగురమగు నాశముపై నేల విచారింపవలయును? ప్రపంచమంతయు ద్వేషభూయిష్ఠమైనదని తోచుచున్నది. ఇంతమాత్రమునకే యాతురతనొంద నేల? నాథా! మీ యాజ్ఞవల్లనే నేనును బయలుదేరుచున్నాను. మనము వెళ్లినతరువాత నీ వనమునందలి లతాభవనము కంటకమయమై పోగలదు. భర్త ఇటులనెను. ప్రాణేశ్వరీ! అట్టి పలుకులు పలకు. ఈ జగమున సా ధ్యులు

పుట్టుచు, చచ్చుచుందురు. ఈశ్వరభక్తి, దేశసేవ ఒకటే అర్థమునను జెందును. ఒకటే ఫలితమిచ్చును. వనమునందు వృక్షమెట్లు నివాసము చేయుచున్నవో, అటులే సహజశక్తి, శ్రమలవలన శాంతి, సౌఖ్యము, వృద్ధిపొందించుటకూడ మనుష్యుని కర్తవ్యము. ఇదియే భగవంతుని పూజించుటయును అగును. ప్రియా! ఆలస్యమగుచున్నది. ఈ వనములందుగల మోహమును వదలుము. ఇప్పుడు మనము భరింపరాని మీని వియోగ దుఃఖమును సహింపవలయును.

అంత నతడు చిరపరిచితములగు వృక్షవాటికలు, పక్షిజాలములు కురంగములు మొదలగువానితో సెలవుతీసుకొని విజయతోకలసి నడువనారంభించెను. నెమ్మది నెమ్మదిగా వా రిరువురును వనమునందలి మధ్యమార్గము వెంబడిని పోవుచుండిరి. అప్పుడు వారివెంట వనమును లాగికొనిపోవుచుండిరో యను నటులుండెను. వెనుదిరిగి చూచుచు దీర్ఘనిశ్వాసములతో పరిచయమైన అడవిని దాటిరి

రాత్రి గడచెను. ఉషఃకాంతులు నలుదెసల వ్యాపించుచుండెను. సువర్ణచ్ఛాయగల సూర్యుని లేయెండలో నా దంపతు లిరువురును నడచిపోవుచుండిరి. నడచి నడచి మధ్యాహ్నమునకు వారొక నదియొడ్డున చేరిరి. అచ్చట కాలకృత్యములు దీర్చుకొని కొంతసేపు విశ్రమించి నావల బయలుదేరి, నదిని దాటుట కాలోచించుచు అటునిటు చూచుచుండ నొకపడవ వారి కగుపడెను. అది యొక చెట్టునకు బంధింపబడియుండెను. వెంటనే దానినివిప్పి అమితానందమున వా రిరువురును దాని నధిరోహించి నడుపనారంభించిరి. వారు మనమున త్వరలో నావలిగట్టును చేరుదుమని సంతసించుచుండిరేకాని ముందు రాబోవు విపత్తును వా రెరుంగజాలకపోయిరి. నావ నెమ్మదిగా నదీగర్భమునకు చేరనో లేదో శ్యామవర్ణముగల కృష్ణానది చాల ఆనందములో నున్నట్లుండి ఆకస్మికముగా పెద్దపెద్ద కెరటములతో అల్లకల్లోలము కాజొచ్చెను. మన దంపతులు నదీగర్భ సౌందర్య మీక్షించుచు ఆనందమున మైమరచియుండిరి. ఆసమయమున నెక్కడనుండియో పెద్ద తుపాను సాగినది. సుడిగాలియు, ఉరుములు, మెరుపులు, కారుచీకట్లు కమ్ముకొనుచు మేఘములు భయంకరముగా నుండెను.

ఆకాశమంతయు మిణుమిట్లు గొల్పు మెరుపులు, ఉరుములును, గాలికి గూలు వృక్షములును, నదీజలమున బయలుదేరు కెరటములధ్వనియు భూవలయమంతయు ప్రతిధ్వనించుచుండెను. మూసలధారవలె మేఘగర్జనములతో వర్షము కురియనారంభించెను. పెద్దపెద్ద యుపనదులన్నియు వచ్చి, నదిలో పడుట వలన నదీగర్భము పెద్దది కాజొచ్చెను. పడవ అల్లకల్లోలము కాసాగెను. దానిని ఆపుటకును, నడపుటకును వీలుగాకుండెను. అసహాయయు, అనాధార యునగు యీ నావను కాపాడువా రెవరు? క్షణములో నావ మునిగిపోవునట్లుండెను. నావలోనున్న దంపతు లిరువురును జలమగ్నయగు నావపై జలగర్భమున నివాసమొనర్ప నిశ్చయులైయుండిరి. ఇక నొడ్డును చేరజాలరు. అప్పటి ప్రకృతియొక్క కోప భయానకమైన దృశ్యమునుజూచి యువకు డిట్లనెను.

ప్రాణేశ్వరీ! ఇప్పుడే ఈ క్షణభంగురమగు శరీరమును విడువగలము. నాకు దేహత్యాగమనిన యావంతయు విచారములేదు. జాగ్రతాస్వప్నములవలెనే జననమరణములై యున్నవి. కాని! నా మనోభిలాష మాత్రము పూర్తికానందులకే కడువిచారమగుచున్నది. ఈ శరీరముతో దేశమునకు సేవచేయజాలకపోతిని గదా! ముందునేరయు నాసయును లేదు. ప్రియా! రమ్ము! ఒకపర్యాయము బాహువులనిండ కౌగిలించుకొందము, అఖండజలరాశిలోనున్న మనకు తిరిగి బ్రతుకు నాసయులేదు. ఇదియే కడసారి కోరిక అనెను.

విజయ ఇటులనెను. నాధా! మనము ఉత్తరజన్మయందును కలసియేయుందుము. విచారింపకుడని నవ్వుచు పలికెను. ఇరువురును బాహువులమధ్య నుండియే ముఖచుంబనము గావించుకొనిరి.

ఇలువురును తమ కరములచేత నాలింగనము గావించుకొని హృదయమున హత్తుకొని పరమానందము నొందియుండిరి. శాంతిభూషితులును, శోకరహితులునునగు దంపతులతో నావ క్షణములో నొక కెరటము తాకుడునకు మునిగి జలగర్భమున లీనమైపోయెను. వర్షము వెలసిపోయెను. గాలియు తగ్గిపోయెను. ప్రకృతియంతయు తన సహజతేజమును వెదజల్ల నారంభించెను. మబ్బులు విడిపోయెను. సమీపారణ్యమంతయు తేటగా కాన్పించుచుండెను. చెట్లన్నియు నీటిబిందువులు చిటుకు చిటుకుమనుచుండ సాయంకాలపు సూర్యుని బంగారు కిరణములలో మిలమిల మెరయుచు కొమ్మలసందు నుండి ప్రకృతిని నిక్కి నిక్కి చూచు యూకలతో చూచుటకు కనులపండువుగానుండెను. క్షణముక్రింద నత్యంత ప్రేమానుకూలురగు నిలువురు దంపతు లుండియుండిరి. వా రెటుపోయిరో? ఏమయిరో గదా? భగవంతుని మాయ నెవరెరుంగగలరు. క్షణభంగురమగు శరీరముపై నింత ప్రేమయు నింత యాశయు నేల? అంతయు నిశ్శబ్దము.

* * *

సూర్యబింబము తన కిరణములద్వారా చీకటిని తొలగించుచు తూర్పుదిక్కున చెట్లకొమ్మలు, ఆకులు మొదలగువాని చాటునుండి తొంగి చూచుచున్నటులుండెను. క్రమేపి పైకివచ్చిన కొలదిని బంగారు చాయగల ప్రకాశము వర్ణనాతీతముగానుండెను. సకల ప్రాణులును నిద్రనుండి మేల్కొంచుచుండెను. జలరాశిలోని కెరటములు తీరమును ముద్దిడుకొని పోవుచుండెనా యనునటులుండెను. నీటిలో సూర్యుని ప్రతిబింబము శోభించుచుండెను. ప్రాతఃకాల రమణీయ మీక్షించుచు నొక తపోధను డా నదీతీరమున నటునిటు తిరుగాడుచు నదిలోనికి జూచెను. ఆ యఖండజలరాశిలో నొక శవము కాన్పించెను. అంత నాముని వెంటనే నదిలోనికి దిగి యా శవమును వెలికీడ్చి పరికించిచూడ ప్రాణమున్నట్లు తోచెను. అది పురుషవేషమును ధరించిన స్త్రీరత్నమైయుండ నాముని సంతోషమున శవమును తన కుటీరమునకు గొనిపోయి ఉపచరింప నామెను చైతన్యమొందెను. లేచి కూర్చొని చకితయగు కురంగమువలె నటునిటు చూచుచు మునికి ప్రణామమాచరించి ఆపరిచయమైన స్థలమున నుండుటయు తన పురుషవేషమును స్మృతిపథమునకు రాగా నతి వ్యాకులమున గుండె బాదుకొనుచు నేనిప్పు డెచ్చట నున్నాను! నా ప్రాణేశ్వరు డెక్కడున్నాడు? కృపాకరుడవగు నో మునిశ్రేష్ఠుడా వెంటనే తెల్పుమని అశ్రువులు జలజలరాల దుఃఖించుచు నేమి యిలువురము కెరటపు జలమందు లీనమైతిమని పలికెను. ఈమె సంగతంతయు తపోధను డగుటవలన ముందే తెలసియుండెను. మరల నామె ఇట్లనెను. నాపతిని వదచియుండజాలను. పతికడకు జేర్చుడని ప్రార్థించెను. మునియు నతి స్నేహభావమున పుత్రీ! హతాశ నొందవలదు. నేను వెళ్లి నీపతిని వెదకి తెచ్చెదను. నేను వచ్చువరకును నీ కుటీరములో సుఖముగా నుండుము. నీ కేమియు భయములేదు. నీపతి సజీవుడైన సరే లేదేని శవమునైనను నీకు జూపింతును. అని పరహితరతుడగు నా ముని నదియొడ్డున వెదక నారంభించెను. ఎంత వెదకినను అగాధజలములలో నే శవమును కాన్పింపలేదు. నదీ ప్రవాహమువెంట వెదకుచు నా ముని వెడలిపోయెను

వియోగదవానలము ప్రజ్వరిల్లుచుండ విజయ కొక నిమిషమైన నా కుటీరమున నిలువ మనసొప్పక బయటికివచ్చి వనమును నాల్గుమూలలు పరికించెను. అది మిగుల మనోహరముగా నున్నది. కాని ప్రియసందర్శనలాలసయగు మనస్సున కది కంటకమయముగా నుండెను. ప్రేమ విచిత్రవస్తువు, దీనిలో నద్భుతమగు శక్తిగలదు. జాగ్రన్నిద్రావస్థలు రెండును నొకవిధముగా నేతోచును. ప్రేమయనునిది వ్యాపించియుండినంతవరకు ప్రపంచమే కాన్పింపదు. ప్రేమించు నట్టి వస్తువు స్వర్గమునకన్న నెక్కుడుగా తోచును. ప్రేమప్రవాహము నాపువారెవరు? ప్రేమోన్మత్తులగువారికి ప్రకృతియొక్క రామణీయకమే యవసరము

లేక, ప్రేమలోనే తన్మయులై యుందురు. ప్రేమ విహ్వలయు, వియోగదుఃఖభారయునగు విజయ అధీరయై, పదములు తొట్రుపడ, నదీతీరమునకు బోయెను. అప్పటికి సరిగా రెండు ఝాములయ్యెను. నభోమధ్యమందున సూర్యుడు తన ప్రచండమగు వేడి కిరణముల వెదజల్లుచుండెను. నదీజలము నిర్మలముగా ప్రవహించుచుండెను. ప్రతిప్రాణియు నొండొక వేడికి తాళజాలక నీడలకు పరుగిడుచుండెను. మన విజయ యా గంభీరమగు జలరాశిని జూచి అమిత రోషమున కఠినాత్మురాలవగు నీవే నాపతిని మ్రింగితివి? నన్ను నాథను, అభాగినిగా జేసితివి? నీకేను మంతయు విచారము లేక కలకలా రావముతో ప్రవహించుచుంటివి? హా! ప్రాణేశ్వరా! స్వదేశ సేవా ధురంధరా! సద్గుణపుంజమా? నీవుగాక మాతృదేశము నుద్ధరించువారెవరు? భవిష్యత్తుయొక్క ఆశలన్నియు నీతోడనే అంతరించెనా? నీ దేశము నుద్ధరింపకయే నన్ను నాథను జేసి వంచించిపోతివా? ప్రియవల్లభా! నేను నిన్నింక జూడజాలను గాబోలును! నీప్రేమ లతను త్రెంపివైచితివా! నాపూర్వకృత పాపరాశి కంతము లేదా! ప్రాణనాథా! ప్రియా! ఎచ్చట నుంటివని యడుగుచు దీనురాలివలె మార్గము లేక ముండ్లకంపలపై పడుచు, లేచుచు ఆ మహారణ్య మంతయు తిరుగుచు, విలపించుచు, కేకలిడుచు, నొక చెట్టుక్రింద వేసారి కూర్చుండెను. ఇంతలో నొక మనుష్యవాక్యమువలె నొకధ్వని వినిపించినట్లు తోచ మరల పరుగిడ నారంభించెను. తిరిగితిరిగి డస్సిపోయి, శరీరము కృశింప, నాబాలిక నడువజాలక ఒకచోట కూర్చుండి ఇట్లాలోచింపసాగెను. నేనెంత శ్రమపడినను నాప్రియుడు లభింపడు. ఆయన దేశసేవ జేయవలెనను కోరికతోడనే మృతినొందెను. అట్టి కోరికను నిర్వర్తించిన నేనును ధన్యనగుదునని దృఢమనస్సుతో లేచి కొంతదూరముపోవ నొకదారి కాన్పించెను.

ముని కొంతదూరము వెళ్ళగావెళ్ళగా నదిలో నొక పురుషశవము గాన్పించెను. ఆశ్చర్యమున దాని నొడ్డునకు జేర్చి కొంత చైతన్య మెందవుదున్నట్లు గాన్పింప తన కుటీరమునకు జేర్చెను. అచ్చట విజయ లేకుండుటకు విస్మితుడై చుట్టుపట్ల నున్న వనము నంతయు వెదకి యామెను గానక తిరిగివచ్చి యువకుని శరీరమునకు వేడి తగులుటకై మంటవేసెను. కొంతసేపైన తరువాత యువకుడు స్వప్నమునవలె కలవరింపసాగెను. విజయా! ప్రాణప్రియా! దేశోద్ధారణకొఱకై నాతో బయలుదేరితివి. నిన్ను మించిన సహాయురాలిక నాకెవరు లభింతురు? ఎంతలో మాయమైతివి. అనుచుండ నాముని పరమానందముతో నీతడు దేశభక్తుడు లభించెనని పరమేశ్వరునికి ధన్యవాదము లొసర్చెను. అతని శరీరమును గాంచినంతనే మునికి అమితమగు ప్రేమ యంకురించెను. ' కొంత తడవునకు యువకుడు లేచి కూర్చుండి మునికి వందన మాచరించెను. మునియు వానితో కుమారా? నీశరీరము జలములో కొట్టుకొనిపోవుచుండ నేను పట్టి తెచ్చితి. నీవెవరి పుత్రుడవో తెల్పుమన యువకుడిట్లనెను. నాచరిత్ర చాలయున్నది. అయినను తమ యాజ్ఞానుసారము క్లుప్తముగా చెప్పెదను. మాది 'మిలను' పట్టణము. నాకు బాల్యముననే నాతల్లి గతించెను. నాతండ్రి దేశమున ప్రబలిన అత్యాచారములను సహింపజాలక హాహాకారములిడు జనులకు సహాయమొనరించిన నేరమున రాజకర్మచారులు శిక్షింప ఎంతచెప్పినను పెద్ద న్యాయాధికారియు వినక కఠినమగు శిక్షను విధించి బాధించుచుండ నన్ను వెంటనిడుకొని పోయి తన మిత్రుడగు నొక మునికి నన్నప్పగించి చనెను. నేనా ఋషివద్దనే పెరిగితిని. నాకంటెను చిన్నదగు బాలికయు ఆయనవద్దనున్నది. ఆమెయును నాకును చాల మైత్రియుండెడిది. తగు సమయమున మాకిరువురికిని వివాహమొనరించి మమ్ము దేశసేవాయుక్తుల గమ్మని యాశీర్వదించి పరమపద మలంకరించెను. ముని యాజ్ఞానుసారముగా మేమిరువురమును దేశసేవ జేయుట కమితానందముతో బయలుదేరి మధ్యత్రోవలో నాప్రియధనమగు విజయను గోల్పోతిని. ఈనదిలో తమ కేదేనొక శవము

గాన్పించిన నానతీయుడని కన్నులు అశ్రుపూరితముగాగ బలికెను. అంతనాముని విజయ సంగతి చెప్పక, కుమారా! నీవు దేశభక్తుడవుగాన నే చెప్పునట్లు చేయుము. మనదేశమున అసంఖ్యాకులగు జను లన్నము లేక మల మల మాడి చనిపోవుచున్నారు. అన్నవస్త్రములకే కరవై నిలువ నీడలేక అల్లకల్లోలమగుచు ఉద్యమము సాగించుటకైనను శక్తిలేక అల్లాడువారి కేమిగతి? ఎవరి ముఖముపైనను సంతసమే లేదు. జార, చోరులు ప్రబలిపోయిరి. దరిద్రత వల్లనే ఇట్టి విపత్తులు సాగినవనుటకు సందియము లేదు. నీవు నేడే బయలుదేరి దేశము నుద్ధరింప ప్రయత్నములు మొదలిడుము. అవసరమగుచో నేనును వచ్చి నీకు సాయపడెదను. వైరుల మాయలకు లోబడకుము. పుత్రా! మంగళదాయకమగు మార్గమున జనుము. నీకోరిక ఫలించును. కీర్తికాముడవగుము. పొమ్మని పలికెను.

విజయ పిచ్చిదానివలె నా దారివెంట పోను పోనొక గ్రామమును జేరెను. ప్రాతః కాలానందమున కూడా నా గ్రామ మతి వ్యాకులమున నున్నట్లు గాన్పించుచుండెను. అది చలికాలము. ఒక గృహములో భయంకరమగు చలిబాధకు సహింపజాలక వస్త్రహీనుడై చినిగిపోయిన అంగవస్త్రమును ధరించి ఎండలో కూర్చుండిన మానవునొకని విజయ గాంచెను. అతని భార్యయు, పసిబిడ్డయు నేల నొక గడ్డిచాపపై చలికి వణకుచు పరుండియుండిరి. వారి శరీరము లన్నము లేక కృశించియుండెను. విజయయు వారి కెదురుగానే చలికి వణకుచు వారి హీనస్థితిని గాంచుచుండ నామానవు డీమెను గాంచెను. వెంటనే యతడు లోనికేగి యాగడ్డిచాపను దెచ్చి యామె కిచ్చి కొంత గడ్డిని దెచ్చి నిప్పుతో వెలిగించి యామెను చలికాచుకొన ప్రార్థించెను. అంత నామె వాని త్యాగమున కాశ్చర్యపడి, అన్నా, నీకిట్టి దుస్థితెట్లు సంభవించెను. అని యడిగెను. అమ్మా! నాపూర్వ పుణ్యవశమున నీ వంటి సాధ్విని గాంచగల్గితిని. నాజన్మ కృతార్థతనొందె. ఈదేశమున వ్యాపించిన దుండగములు వర్ణనాతీతములు. కొలది దినముల క్రింద నొక సజ్జనుని రాజభృత్యులు అన్యాయముగ దండింప దలచి నన్ను మిథ్యాపరాధమునకు సాక్ష్యమిమ్మనిరి. నే నసత్యమాడనని స్పష్టముగా చెప్పినందులకు నిరపరాధినగు నన్ను బాధించి నాయింటి యందున్న యావదాస్తిని భూమిని కూడా లాగుకొని పోయిరి. తినుట కన్నము లేదు. ఉపవాసములతో దినముల గడుపుచుంటిని. ఈగడ్డిచాపయే నాకు మిగిలిన ధనము. అని కన్నుల నీరుగార బలికెను. ఆహా! మాతృదేశ జనుల కెట్టి దుర్దశ కల్గినది! ఇట్టి వారికి సేవజేసి సుఖ మొనగూర్పవలయుననియే నాపతి కోరిక. నేనిప్పుడే బయలుదేరి స్వదేశము నుద్ధరింతునని సన్యాసివేషమున చేత త్రిశూలము ధరించి, ఇల్లిల్లును, ప్రతిగ్రామమును తిరుగుచు, దేశభక్తితో నిండిన గీతములబాడుచు, జనులకు వీరరస మొలుకునట్టి వచనముల నుపన్యసించుచు, దేశోద్ధారణకొఱకై సైన్యమును గూర్చుచుండెను. యువకుడును కొన్ని గ్రామములలో నిజేప్రకారముగా సేనను ప్రోగుజేసి యుద్ధసన్నద్ధుడై యుండెను. ఋషియు నిలను నగరప్రాంతమున నుపన్యాసముల గావించుచు జనుల యజ్ఞానతిమిరము పారద్రోలుచుండ, విజాతియులు పట్టజాలని కోపమున నింకను ప్రజలను, ఈ ముప్వురు దేశనాయకులను బాధింప మొదలిడ జనులందరును సింహములవలె గర్జించుచు యుద్ధమునకు బయలుదేరిరి. యువకుని సైన్యము కొంచిగానే యున్నది. వైరిబల మెక్కుడైనను లెక్కింపక ప్రాణముల కాసింపక శత్రులను గనుమాడుచుండ నొక వైపునుండి ముని లెక్కకు మించిన యోధుల వెంటనిడుకొనివచ్చి యువకునకు సహాయమయ్యెను. రెండవవైపునుండి విజయయు అసంఖ్యాకులగు వీరులతో భైరవీనాదముతో వచ్చి కలసెను. ఈకొట్లకొలది దేశభక్తులగు వీరులధాటి కాగజాలక శత్రులు పారద్రోడగిరి. యువకుడు యుద్ధములో గాయములుతిని డస్సియుండ నొక వైరి తన ఖడ్గముతో నొకదెబ్బ కొట్టబోగా ముని వాని వధించెను. యువకుడు వానిని హతమార్చెను. మునియొక్క కృపకు యువకుడత్యానందముతో సాష్టాంగ నమస్కారము గావించెను. విజయ కఠిన ప్రహారములచే వైరుల పారద్రోలి గుణిసన్నిధికి వచ్చి నిలచెను. అప్పుడు

ముని ప్రసన్నవదనముతో నిట్లనెను. కుమారా! ఇప్పటికి నీ తండ్రి కోరికను చెల్లించి ధన్యుడవైతివి. నిన్ను కఠిన హృదయమున వదలి అడవులందు తిరుగుచు దేశము నుద్ధరింప ప్రయత్నమొనరించిన నేనే నీతండ్రిని! నీతో సమానయశశ్వినియగు విజయయు నీవు దొరికినదినముననే నాకు దొరికినది. నేనామెను నాకుటీరముననుండ నియమించి నిన్ను వెదకుచుండ నెటకో వెళ్ళిపోయినది. మరలివచ్చి నేనెంత వెదకినను గాన్పింపలేదు. సత్యమగు ప్రేమ యెన్నటికిని నిష్ఫలము కానేరదు. నీవు నన్ను గుర్తింపజాలక పోతివి. పూజ్యురాలును సద్గుణ సంపన్నయునగు విజయతో కలసి కీర్తి నార్జింపుము. మిమ్ము గాంచి నేటికి నా జన్మము పవిత్రమైనది. నేనింక సంతసముతో దేహత్యాగ మొనర్చుచున్నాను. పుత్రా సెలవు. జయధ్వనులు చెలరేగుచుండ ముని ప్రాణమును విడచి భూమిపై బడిపోయెను. హా! తండ్రీ యనుచు యువకుడును మూర్ఛనొందెను. ధన్యుడగు ముని స్వర్గమలంకరించెను. మూర్ఛితుడగు యువకుని శిరమునొడి యందిడుకొని విజయ పరిచర్యలు సల్పుచుండ యువకునికి చైతన్యమొందవి యామెను కౌగిలించుకొని ముద్దిడుకొనెను. ఇరువురును పూర్వపు సౌఖ్యమునను, ఆనందమునను నోలలాడిరి.

దాంపత్యము

శ్రీమతి వీరుభొట్ల రామలక్ష్మమ్మగారు

ఇరువురిమాటలొక్కటయి, ఈసును జోడునుమాత్తి, పూవునున్
పరువమువోలెనేకమయి, పాపలతోనిలుదీర్చుకొంచు, కా
పురమొనరించుదంపతులె పుణ్యులు, వారిదెకాపురం, వధూ
వరులనవారె, నిత్యవిభవాన్వితులన్నువారె, సోదరీ!
నగలునునాణెముల్ మఱి'బెనారసు' చీరలుఁ గంచుకంబులున్
అగరులు తారహారము,లనారతమున్ గొనితెమ్మటంచు, దా
మగనిని బాధపెట్టక సమంచితరీతిఁజరించునట్టి యా
మగువయె, సోదరీ! మగువ మానితసద్గుణపాత్ర భూష్పలిన్.
తా నతిచెప్పువస్తువులు తప్ప కవశ్యముగానెరింగి (యున్)—"స
న్యాసము, చట్టుమండలము, ఆ! యిటులైనచో ఒక్కనాటితో
నే నరికాపురం"బనక నిచ్చలు 'కన్ను'ను'బున్ను' లేక, సం
తోసముతోడ సంస్కృతినిద్రోసెడి భర్తయె భర్త సోదరీ!
కలహములున్నచో పొరుగుగా నివసించు గృహస్థకోటికిఁ
కులుకులు, బంధువర్గమునకున్ మఱితక్కగలట్టివారికిన్
జులకన, యింటగుట్టునకు జోటులభించదు, గౌరవోన్నతుల్
తొలఁగును, గాన దంపతులలో కలహంబులు సాగవచ్చునే?
కలిమియెంతున్నగాని సౌఖ్యంబులేదు దంపతులు ప్రేమపథమును దప్పిరేని,
కలిమిలేకున్నగాని సౌఖ్యంబుగలదు భార్యయున్ భర్త యనురాగబద్ధులైన.